

# కథా కౌముది

## ఊరంతా సందడి

ఉదయలక్ష్మి ముప్పలనేని

**రఘురామయ్యగారి** మనవరాలికి పెళ్ళిచేయాలనుకుంటున్నారు. సంబంధాలు రెండు మూడు చూసి పెట్టుకున్నారు. నాయనమ్మ నాగరత్నమ్మగారు "ఏవండీ ఈ రోజు గురువారం శాస్త్రిగారి దగ్గరకు వెళ్ళి సంబంధాలు గురించి చెప్పి ఎప్పుడు మంచిరోజులో కనుక్కురండి" అన్నారు.

ఆయనతోపాటు చిన్నాడు పెరట్లో కాసిన గుమ్మడికాయ, చక్కెరకేళీ హస్తంతో బయలుదేరాడు.

"ఇంటికి చిన్న చిన్న మరమ్మత్తు పనులున్నాయి. వడ్డి కోటయ్యకు, అలాగే వడ్రంగి కోటేశ్వరావుకు కూడా కబురు చేయండి. ఆ తర్వాత సున్నాలు, రంగుల పనులు ఉండనే ఉన్నాయి. నాన్న రామారావుకి అన్నీ ఒక్కసారే అయితే ఇబ్బంది" అమ్మ అరుంధతమ్మ చెప్పింది.

ఊళ్ళోకి దూదేకుల బాబావలి సరంజామాతో దిగాడు. అల్లుడికి అమ్మాయికి బూరగదూది పరుపులు కుట్టించాలని అమ్మకోరిక. ఎండిన కాయనుండి దూది వడికి మెత్తటి ఇపరుపులు, దిళ్ళు తయారు చేశాడు బాబావలి. గుండెలనిండా దుమ్ము నింపుకుని పట్టు పరుపులు కుట్టి ఇచ్చిన ఆ కష్టజీవిని ఆ తర్వాత ఎంత ఎత్తు పరుపులమీద పడుకున్నా మరువగలమా!?

సంబంధం ఖాయం అయింది. లగ్నపత్రిక వ్రాసుకుని పసుపు కొట్టటంతో పెళ్ళిపనులు పరుగందుకున్నాయి. "పెళ్ళిపనులు మొదలు పెట్టారా?" అంటూ పచారీ కొట్టు లింగయ్యగారు తాతయ్యగారిని పలకరిస్తూ గేటు తీసుకుని వరండాలోకి వచ్చారు.

"రావయ్యా లింగయ్యా కూర్చో" అంటూ కుర్చీ చూపించారు తాతయ్యగారు.

"మా పెద్దాడు బాపట్లలో హోల్‌సేల్ షాపు పెట్టాడు. పెళ్ళికి పెద్ద ఎత్తున సరుకులు కావాలికదా. నాణ్యమైన సరుకులు మనకోసం ధరలు కూడా చూసి వేస్తాడు. మీతో చెప్దామని వచ్చాను" అన్నారు లింగయ్యగారు.

"అలాగే లేవయ్యా అక్కడే తెప్పిద్దాం" భరోసా ఇచ్చారు తాతయ్యగారు. కాసేపు ఆ సంగతులూ, ఈ సంగతులు మాట్లాడి కాఫీ త్రాగి వెళ్ళారు లింగయ్యగారు.

జాండ్ర పేట నుండి పేరయ్యగారు ఆయన తమ్ముడు వాళ్ళ మగ్గాల మీద నేసిన చీరలు, పంచెలు, పరికిణీలు బట్టల మూటలతో వచ్చారు. ఆ రోజు పెళ్ళింట్లో ఎంతెంత సందడో. ఎవరికి కావలసినవి వాళ్ళు ఎన్నుకోవటం, మళ్ళీ మళ్ళీ చూసుకోవటం. పెళ్ళిబట్టలు, తలంబ్రాల బట్టలు పెళ్ళికి నాలుగురోజుల ముందే నేయించి తీసుకొస్తానని సంతోషంగా బయలుదేరి వెళ్ళారు పేరయ్యగారు.

"రారా భద్రయ్యా నీకే కబురు చేయాలనుకుంటున్నాను. నీవే వచ్చావు" వాకిట్లో చూడగానే సంతోషంతో ఎదురు వచ్చి పలకరించి కూర్చోమన్నారు నాయనమ్మ. “భద్రయ్యా! మేనమామలు నలుగురు మేనకోడలిని ప్రధానం బుట్టలో తీసుకుని రావాలంటున్నారు. బుట్ట చక్కగా అందంగా అల్లించు. అలాగే కాలిగోళ్ళ దగ్గర వడ్లు పోయటం కోసం, వంటదగ్గర కావలసిన జల్లిబుట్టలు కూడా కావాలి అంటూ 'అబ్బాయ్ కావల్సినవి తెప్పించుకోవాలిగా భద్రయ్యకి డబ్బులు తెచ్చివ్వు ‘ అని చెప్పి” తిను భద్రయ్యా “ అంటూ లడ్లు, బూందీ అరటిపళ్ళు తెచ్చిపెట్టారు.

గురువారం మంచిరోజని పందిళ్ళు వేసే సుబ్బారావు తండ్రీ, కొడుకులతో వచ్చి పందిరేసి భోజనాలు చేసి గౌరవంగా ఇంటికెళ్ళారు.

బజారంతా అత్తరు వాసనే. ఇంకేముందు అత్తరు సాయిబుగారు ఊళ్ళోకి వచ్చారు. ఆయన్ని చూడగానే అందరికీ ఒకటే హుషారు. "అత్తరుందా, పన్నీరుందా, ఏ సెంటు ఉంది?" ఎవరికి కావలసినవి వాళ్ళకు, పెళ్ళికి కావలసిన కర్పూరపు దండలు, పూల గుత్తులు, పెళ్ళిదండల ఆర్డరంతా ఆయనకే మరి.

గాజుల రామయ్య మలారం మోసుకుంటూ పచ్చని పందిట్లో కాలుమోపాడు. పండు ముత్తైదువుల నుండి పసిపిల్లలదాకా అందరికీ పండగే. ఎవరికి కావలసిన రంగురంగుల గాజులు వాళ్ళెన్నుకుని చేతులనిండా గాజులేయించుకున్నారు. పెద్దాళ్ళు గాజుల మలారానికి, పెళ్ళికూతురు, మిగతా వాళ్ళు రామయ్య కాళ్ళకు దండం పెట్టుకున్నారు. మనసు నిండిన తృప్తితో నిండుగా దీవించాడు రామయ్య.

చాకలి వెంకన్న, భార్య సరస్వతిని చేతి చలవ అంటూ పెళ్ళి పనుల్లో ముందుపెడుతున్నారు. వెంకన్న వేరే ఊళ్ళల్లో ఉన్న చుట్టాలందరికీ శుభలేఖలు పంచి వచ్చాడు. మగపిల్లాడి పెళ్ళయితే 'ప్రదానం' బాధ్యతంతా వాళ్ళదే మరి.

మంగలి మంగళవాయిద్యాలతో, పసుపు కుంకుమలు కానుకలతో గరిక బుడ్డికోసం బయలుదేరాడు. పెళ్ళిరోజు రానే వచ్చింది. మంగలి శ్రీరాములు వేకువ ఝాముకు సన్నాయి మేళంతో వచ్చి అందరినీ మేలుకొలుపుతో నిద్రలేపాడు. కుమ్మరి నాగన్న ఇంటికి మంగళవాయిద్యాలతో వెళ్ళి కానుకలిచ్చి గరికబుడ్డి తీసుకొచ్చారు. పెళ్ళి భోజనాలకి అన్నం వండి రాసిపోసి దీపారాధన చేసేది నాగన్న కుటుంబమే.

బాసికాలకు, మంగళసూత్రం, నల్లపూసల కోసం వీరాచారిగారింటికి మేళతాళాలతో, కానుకలతో వెళ్ళి తీసుకొచ్చారు.

కాలగోళ్ళ సమయంలో శ్రీరాములు భార్య వసంతదే పెత్తనమంతా. "నాకు ఎం.ఎల్.ఏ పంచెలు, వసంతకు సిల్క్ చీర తెచ్చారా?" అంటూ కోరికలు.

"మీకు తేకుండా ఉంటామా రాముడూ!" అంటూ నాయనమ్మ.

అంగరంగ వైభవంగా కళ్యాణం కమనీయంగా జరిగింది. సంక్రాంతి నెల పట్టారు. గుళ్ళో ధనుర్మాసం పూజలు, వేకువఝామునే వచ్చే హరిదాసులు. చిన్నారి తల్లి చిట్టి చిట్టి దోసిలిలో బియ్యం పోస్తుంటే వంగి పోయించుకుంటూ ఆయన ఇచ్చే దీవెనలు ఆ పసి మనసుకు జీవితం అంతా గుర్తుపెట్టుకుని ఉండే మంత్రాలే అవి.

బుడబుక్కల వాళ్ళు, గంగిరెద్దుల వాళ్ళు, లంబాడీలు అందరికీ వాకిట్లో నిలేసిన ధాన్యం ఒక బస్తా అయిపోగానే ఇంకోటి ముడి విప్పుతూ పంచిపెడుతున్నారు తాతయ్యగారు.

★★★

అవి..బంగారు రోజులు! పెళ్ళి అంటే ఒక సామూహిక సహజీవన సౌందర్యంగా వెలుగొందిన రోజులు..!! కాలచక్రం తిరిగితిరిగీ మళ్ళీ ఎప్పటికైనా ఆ రోజులు తిరిగొస్తాయా!?

**Click here to share your comments on this story**